

కథా కౌముది

# విదుర విందు ఆర్.సి.కృష్ణస్వామిరాజు

ఇంటి ముందరి మామిడి చెట్టులో పక్వాని కొచ్చిన కాయల్ని దోటితో కోస్తూ ఉన్నాడు మునిశేఖరుడు.

కొడుకుని చూసిన శోభక్క 'నా బంగారు బిడ్డ పెళ్ళీడుకు వచ్చినాడు కదా, మంచి బిడ్డను చూసి మూడు ముళ్ళు కట్టించేస్తే బాగుంటుంది కదా' అనుకుంది. వెంటనే తల వెంట్రుకల్ని కొప్పుగా ముడి వేసి నేరుగా కృష్ణకుమారి ఇంటికి పోయింది.

వెనుక వైపు రవిక కొంచెం పైకి జరిపి కూతురు రెడ్డిరాణి దగ్గర కొయ్య దువ్వెనతో వీపు గోకించుకుంటోంది కృష్ణకుమారి.

"ఏమి కృష్ణ కుమారీ... ఇంట్లో చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్లు... నీ కూతురికి పెళ్లి సంబంధాల కోసం దేశమంతా తిరగతా వుండారంట కదా! మాఇంట్లో మీసాలొచ్చిన మొగ పిలగోడు ఉండేది మరిచినారా?' అని అడిగింది.

శోభక్క వచ్చింది తన పెండ్లి విషయం మాట్లాడే దానికని తెలుసుకున్న రెడ్డిరాణి బుగ్గలు ఎరుపెక్కినాయి. లోపల్లోపల తియ్యటి పానకం తాగినట్లు ఉన్నా, బయటికి మాత్రం సిగ్గు నటిస్తూ ఇంట్లోకి తుర్రుమంది.

"అదెంత మాటక్కా... చదువుకున్న బిడ్డ కదా, ఆ అమ్మి మనసు తెలుసుకుని చెబుతానులే" అని సమాధానమిచ్చింది.

'మన పిలకాయలు అమ్మానాన్నల్ని ఎదిరించింది లేదు కదా, సర్ది చెప్పు. నాలుగెకరాల చెరుకు తోట ఉంది, బ్యాంకు వాళ్ళు లోన్ ఇస్తే ట్రాక్టర్ కొందామని కూడా ఉన్నాడు. మొన్నటికి మొన్న డ్రైవింగ్ లైసెన్సు పరీక్ష

కూడా పాసయినాడు. మా దాయాదుల్లో అందరూ మా వాడిని సినిమా యాక్టర్ అర్జున్ లాగా ఉంటాడని దిష్టి పెడతారు. దిష్టి తీసితీసి భుజాలు నొప్పి పుడతా వుండాయనుకో...” అని గొప్పగా చెప్పింది శోభక్క.

ఇంతలో... సైకిల్లో సర్రున వచ్చి ఆగినాడు నాగూరయ్య.

“అక్కా... ఈరోజు మన ఊర్లో రాములవారి గుడికాడ, నాటకం జరగబోతోంది. మీరంతా రావాలి. మహాభారతంలోని ‘విదుర విందు’ ఘట్టం అది. చాలా గొప్పగా ఉంటుంది” అని చెప్పినాడు.

“మాకెక్కడ కుదురుతుంది? ఇంట్లో పనులే చేసినంత ఉన్నాయి. కుదిరితే వస్తాము!” అని చెప్పింది కృష్ణకుమారి.

‘అట్లంటే కుదరదక్కా... ఆ నాటకంలో శ్రీకృష్ణుడి వేషం వేసేది నేనే... మీరంతా కచ్చితంగా రావాల్సిందే!”

“ఆ ముక్క ముందు చెప్పాలి కదా... నువ్వు వేషం వేస్తానంటే ఎందుకు రాకుండా ఉంటాము?... అయినా నాగూరయ్యా... నీ ముఖం మీద మీసాలు అట్లనే ఉండాయి. నువ్వు మీసాల కృష్ణుడివా?” అని అడిగింది శోభక్క.

‘మేకప్ చేసేటప్పుడు తీసేస్తాలే అక్కా... స్టేజి పైన చూస్తారు కదా, నేల మీదికి దిగిన శ్రీకృష్ణుడిలా కనిపిస్తాను. మీకు తెలుసో లేదో, నన్ను చాలామంది ‘మన ఊరి ఎన్టీయార్’ అని పిలుస్తారు. ఈ నాటకం మన ఊర్లోనే కాదక్కా... చెరువు కింద ఉండే రాసపల్లిలో కూడా వచ్చేవారం వేస్తాము. మీరు వచ్చి తీరాల్సిందే!!” అంటూ సైకిల్ బెల్ ఘణఘణమని మోగిస్తూ వెళ్ళినాడు.

“ఇంట్లో మాట్లాడి చెప్పు కృష్ణకుమారీ... ఏ వయసులో సంబరం ఆ వయసులో జరగాలి...” అంటూ వచ్చిన దారినే ఇంటికి నడిచి వెళ్ళింది శోభక్క.

‘నిజమే కదా, అందే కొమ్మల్ని వదిలేసి, అందని కొమ్మల వైపు ఎందుకు చూడటం?’ అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది కృష్ణకుమారి.

ఉతికి ఆరబెట్టిన పైట, పావడాల్ని మడిచి పెడుతున్న రెడ్డిరాణి దగ్గరికి వెళ్ళి అడిగింది కృష్ణకుమారి.

“మన ఊరి మునిశేఖరుడంటే నీకు ఇష్టమేనా?” అని.

అర తల పైకెత్తి “సగం ఇష్టం, సగం ఇష్టం లేదమ్మా!” అని చెప్పింది.

"అదేమి సమాధానమే... ఇష్టం ఉంటే ఇష్టమనాలి... లేకుంటే లేదని చెప్పాలి. అటూఇటూ కాకుండా 'సగం' సమాధానం చెబితే ఎట్లనే?" అని గట్టిగా అడిగింది.

"హైటు, వైటు ఇష్టమే అమ్మా... అయితే ఒక చిన్న డౌటు ఉంది"

"ఏమి డౌటు ఉంది నీకు? మేము అమ్మానాన్నలు చెప్పినట్లు కాబోయే మొగుణ్ణి కండ్లారా చూడకుండా తలలు వంచి తాళి కట్టించుకున్నాము. పెద్దవారి మాటలు చల్లటి చద్ది మూటలని తెలుసుకో!" అని సర్ది చెప్పింది.

"అవి పాత రోజులు. ఇప్పుడు రోజులు మారాయమ్మా"

"సరే... చెప్పి ఏడువు!"

"నేనేమో టెన్త్ పాస్ అయినదాన్ని. ఆయనేమో టెన్త్ లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినవాడు. రేపు పెళ్లి అయినాక, ఆయన్ని ఆయనే తక్కువనుకుని నన్ను ఏడిపిస్తే ...?"

"అదే నీ బాధ అయితే అంతగా పట్టించుకోవాల్సిన సమస్య కాదులే!. రెండు కాన్పులైతే అవన్నీ వాటికవే సర్దుకుంటాయి" అని చెప్పింది కృష్ణకుమారి.

అమ్మ మాటలకు... రెడ్డిరాణికి నోటినిండా తియ్యటి పనస తొనలు పెట్టినట్లయ్యింది.

XXXXXX

ఇండ్లల్లో దీపాలు పెట్టే వేళయ్యింది.

అమ్మ, రెడ్డిరాణితో పెళ్ళి ప్రయత్నాలు చేస్తోందని తెలుసుకున్న మునిశేఖరుడి మనసు పూల బావిలో పడినట్లయ్యింది.

అద్దంలో ముఖం చూసుకున్నాడు. 'పెళ్ళి కళ వచ్చిందే బాలా...' అని పాడుకున్నాడు.

అంతా బాగుంది కానీ... ఏదో 'తేడా' కొడ్తోంది.

'ఏమిటా...' అని చూశాడు.

ఎడారిలో నాగజెముడు మొక్కల్లాగా గడ్డం మొలకలు దండిగా వచ్చి ఉన్నాయి.

నేరుగా క్షవరం చేసే మునస్వామి దగ్గరికి పోయినాడు. కోర మీసం పెట్టమని, శుభ్రంగా గీకమని చెప్పినాడు. షేవింగ్ అయినాక, తెల్ల పటికతో గడ్డమంతా రుద్దినాడు మునస్వామి.

"మంట, మంట!!" అని పై కప్పు అదిరేట్లు అరచినాడు మునిశేఖరుడు.

"పెళ్లి కాకుండానే మంటలంటే ఎట్లా? పెండ్లి అయినాక ఇంకెన్ని మంటలో కదా!" అని పడీపడీ నవ్వినాడు మునస్వామి.

ముఖంలోకి మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని "మంటాలేదు, గింటాలేదు...ఊరకే చెప్పినాను" అని చెప్పి ఉచితంగా వచ్చిన పౌడర్ డబ్బా తీసుకుని మెడ చుట్టూ చల్లుకున్నాడు. దువ్వెనతో మీసాలు దువ్వుకున్నాడు.

అడ్డగళ్ళ లుంగీ ఎగ్గట్టి వీధిలోకి వస్తే మెరుపులాగా అనిపించింది.

నిజంగా అది మెరుపు కాదు, మెరుపు తీగ లాంటి రెడ్డిరాణి రాక.

బరువైన పట్టు చీరకట్టి నాగుపాము నెక్లెస్ మెడలో వేసుకుని నడవలేక నడుస్తూ వస్తోంది కృష్ణకుమారి. పక్కనే గులాబీ రంగు పావడ, పైట వేసి, మెడలో ఒంటిపేట చైను వేసి పెళ్ళికూతురి నడక నడుస్తూ వస్తోంది రెడ్డిరాణి.

మునిశేఖరుడి చూపులు సూటిగా తగిలాయి.

వేడి సెగకి కరిగిన వెన్నలా రెడ్డిరాణి మనసు కరిగింది.

వారి చూపుల్ని అక్కడికక్కడే రాసే కవులుంటే... అప్పటికప్పుడే వంద పద్యాలు పుట్టి ఉండేవి.

వెనుకనే పరిగెత్తుకుంటూ వచ్చి, వారితో కలిసిపోయింది కాటన్ చీర కట్టిన శోభక్క.

XXXXXX

విదుర విందు నాటకం ప్రారంభమయ్యింది.

శ్రీకృష్ణుడు వేదిక మీదికి వచ్చాడు.

'కృష్ణుడమ్మ కృష్ణుడు

మన ఊరి కృష్ణుడు

ముచ్చటైన కృష్ణుడు

అందాల కృష్ణుడు...' అంటూ నాగూరయ్య మిత్రమండలి గట్టిగట్టిగా పాడినారు.

ఒకే వరుసలో దూర దూరంగా కూర్చున్నారు రెడ్డిరాణి, మునిశేఖరుడు వాళ్ళవాళ్ళ అమ్మలతోటి.

జడలోని గన్నేరు పూలను చిన్నగా పెరికి కింద వేసింది రెడ్డిరాణి. చేతి గుడ్డను కిందికి జారవేసినాడు మునిశేఖరుడు. కావాలనే... నేల మీదికి వంగిన ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. కళ్ళుకళ్ళు కలిసాయి. ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

విదుర విందు నాటకంలో విదురుడు శ్రీకృష్ణుడికి ఇచ్చే విందు ప్రారంభమయ్యింది. నాటకంలోని విదుర విందుతో పాటు ఊర్లో కూడా పాయసం విందు జరుగుతుంది.

అప్పుడే... ఊరి సర్పంచ్ మనుషులు అందరికీ దొన్నెలు చేతిలో పెట్టినారు. మర్రి ఆకులతో చేసిన చూడ ముచ్చటి దొన్నెను మునిశేఖరుడు తీసుకుంటూ ఉంటే మళ్ళీ అతడి వైపే చూసింది రెడ్డిరాణి.

చిన్నగా మీసం తిప్పుతూ మునిశేఖరుడు–

'పుట్టిందే నీకోసం

మీసం పెట్టిందే నీకోసం

ఇక్కడికొచ్చిందే నీకోసం

పడిచస్తా నీకోసం...' అని మనసులోనే అనుకున్నాడు.

మునిశేఖరుడి మనసు అర్థం చేసుకున్న రెడ్డిరాణి అరనవ్వు నవ్వింది.

ఆ నవ్వుకు మునిశేఖరుడి మనసు ఎక్కడికో... వెళ్ళింది.

చేతిలోని దొన్నెను మడిచి జేబులో పెట్టుకుని వీధిలోకి బయలుదేరినాడు.

XXXXXX

మూడురోజులు గడిచాయి.

శోభక్క సంబంధం వద్దని చెప్పింది రెడ్డిరాణి.

" రాత్రికి రాత్రే వద్దంటే ఎలా? ఎందుకు వద్దంటున్నావో చెప్పు?" అని నిలదీసింది కృష్ణకుమారి.

ఇంటిముందర ఉన్న కాగడాల చెట్టు దగ్గరికి తీసుకెళ్ళి "చూడటానికి మల్లెల్లాగా ఉన్నా, మల్లెల వాసన వీటికి రాదు కదా!" అని బాధగా చెప్పింది .

ఇంటి పెరట్లోకి తీసుకెళ్ళింది.

ఉల్లి చెట్లను చూపింది. 'మల్లె పూవు మల్లె పూవే, ఉల్లి పువ్వు ఉల్లి పువ్వే కదా...' అని జీర గొంతుతో అంది.

ఎవరో వచ్చిన అలికిడి అయితే వెనక్కి తిరిగి చూసింది, శోభక్క వచ్చి అక్కడ నిలబడి ఉంది.

"నా కొడుక్కి ఏమి తక్కువ రెడ్డిరాణీ ... ఆరోజు క్షవరం చేసే మునస్వామి అంగడి

నుంచి నా కొడుకు వచ్చేది చూసి ఉంటావు. షేవింగ్ కూడా చేసుకోలేనివాడిని ఎట్లా పెండ్లి చేసుకుందామని అనుకుంటున్నావేమో... సెల్ఫ్ షేవింగ్ నేర్చుకునే కొత్తల్లో తెలిసీ తెలియక గడ్డం కోసుకున్నాడు. రక్తం చూసి జడుసుకున్నాడు. అందుకని సెల్ఫ్ షేవింగ్ మానినాడు. వాడికి ట్రిమ్మర్ కొనిస్తాము. చిన్నచిన్నగా నేర్చుకుంటాడు. అంత చిన్న విషయానికి కమలాపండులాంటి నాకొడుకుని వద్దనుకోవద్దు! కాగడా వేసి వెదికినా నా కొడుకులాంటి బంగారు మొగుడు నీకు ఈ పది పల్లెల్లోనూ దొరకడు గాక దొరకడు" అని చెప్పి సరసరా వెళ్ళిపోయింది.

"ఏమిటే నీ బాధ?" అని గట్టిగా నిలదేసింది కృష్ణకుమారి.

"అమ్మా... విదుర విందు నాటకం వేసే ప్రతిసారీ మన ఊర్లో అందరికీ దొన్నెలిస్తారు. అందులో వేడివేడి పాయసం పోస్తారు. దొన్నె ఎందుకు చేతికి ఇచ్చారో తెలియని మనిషి. మా చూపులు కలిసే శుభవేళ, దొన్నెలో పోసే పాయసాన్ని జుర్రుకుని తాగకుండా... ఇచ్చినదాన్ని మడిచి జేబులో పెట్టుకుని వెళ్ళినాడు. అంత చిన్న విషయాలు తెలియని మనిషిని ఎట్లా పెండ్లి చేసుకునేదమ్మా? జీవితకాలం ఎట్లా ఏగేదమ్మా" అని నోట్లో పైట పెట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తూ ఇంట్లోకి పరిగెత్తింది రెడ్డిరాణి.

'ఏమి అర్థమయ్యిందో, ఏమో ...' అక్కడే ఉన్న కోడి పుంజు.... 'కొక్కోరోక్కో...' అని అరుస్తూ, రెక్కలు టపటప లాడిస్తూ ఎగిరి వెళ్ళిపోయింది.

'ఏమి చేసేదిరా భగవంతుడా... నా కూతురు పదో తరగతి వరకు చదివే ఇన్ని వయ్యారాలు పోతా ఉందే... పెద్దపెద్ద చదువులు చదివితే మరెన్ని వయ్యారాలు పోయి ఉంటుందో కదా...' అని తల పట్టుకు కూర్చుంది కృష్ణకుమారి.

XXXXXX

మరుసటి వారం–

పక్క ఊర్లో విదుర విందు నాటకం రచ్చబండ కాడ జోరుజోరుగా జరుగుతోంది.

జనమంటే జనం కాదు.

అక్కడికి రెడ్డిరాణి ని బలవంతంగా తీసుకెళ్ళింది కృష్ణకుమారి.

సెంటు కొట్టిన కొత్త గుడ్డలేసుకుని 'రాజా' లెక్కన కూర్చుని ఉన్నాడు మునిశేఖరుడు.

ఉభయదాతలు దొన్నెలు పంచి పెట్టినారు. ఘుమఘుమలాడే జీడిపప్పు పాయసం అందులో పోసినారు. రెడ్డిరాణి చూసేట్లు పాయసాన్ని జుర్రుకుని తాగినాడు మునిశేఖరుడు.

తలెత్తి చూసింది రెడ్డిరాణి.

'ఫర్లేదు, దొన్నె లెందుకు ఇస్తారో తెలుసుకున్నాడు. పాయసం తాగడం కూడా నేర్చుకున్నాడు...' అనుకుంటూ ఉండగా ఆమె నోటికి జీడిపప్పు తగిలింది.

చిన్నచిన్నగా దాన్ని నములుతూ మళ్ళీ మునిశేఖరుడి వైపు చూసింది. మునిశేఖరుడి పంటికి ఎండు ద్రాక్ష తగిలింది. కసుక్కున కొరికే సరికి నోరంతా తియ్యగా అయ్యింది. తియ్యటి నోటితో రెడ్డిరాణి వైపు చూసినాడు,

'ఎప్పుడు చేరుతానో నీ ఒడి... అందాకా ఉండిపో నా హృదయపు గుడిలో... ' అన్నట్లుగా ఉన్నాయి రెడ్డిరాణి చూపులు.

'నువ్వు రెడ్డిరాణివి కావు, నా హృదయ రాణివి' అన్నట్లు బదులిచ్చాయి మునిశేఖరుడి కళ్ళు.

'దొన్నె ఇచ్చిన కారణం తెలియక కాదు, పాయసం తాగడం చేతకాకా కాదు, నీ మాయలో పడి అన్నీ మరిచినానే ప్రియురాలా...' అన్నట్లుగా చిన్న నవ్వు నవ్వినాడు మునిశేఖరుడు.

దూరంగా ... కృష్ణకుమారి, శోభక్కలు నిలబడి అంతా చూస్తున్నారు. మునిశేఖరుడు దొన్నెను మడిచి జేబులో పెట్టుకోకుండా తాము చెప్పినట్లు విదుర విందు పాయసం తాగినందులకు విక్టరీ సంకేతాలు పంపారు. కాబోయే నూతన దంపతులను చూస్తూ మనసులోనే ఆశీర్వచనాలు పలికినారు.

అక్కడే ఉన్న రెడ్డిరాణి క్లాస్ మెట్ లు 'లో–బీపి' లలిత, జిడ్డు ముఖం జలజ... 'మాకన్నా మూడు నెలల చిన్నదానికి మొగుడు దొరికినాడు. మాకెప్పుడు దొరుకుతాడో...' అని కుళ్ళు ముఖం పెట్టినారు.

విదుర విందు నాటకం దిగ్విజయంగా ముగిసింది.

★★★

# COMMENTS